బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం, 29 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల



# ఫ్యూచర్ కోసమే..సిటీ నిర్మాణం

- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి మిగతా 3లో..

## సిసి కెమెరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు



### అలాంటి పోలీస్ అధికారులను వదలం

### మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

సంగారెడ్డి,ఏప్రిల్ 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీ డియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్ లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. మిగతా 3లో..

## మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం



- 40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి
- వారణాసిలో ప్రధాని మోడీ

మిగతా 5లో..

## కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే



- కాళేశ్వరం తదితర విషయాలపై ఎందుకు దాటవేస్తున్నారు
- రైతుల గురించి బిఆర్ఎస్‌ది మొసలి కన్నీరు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ విప్ ఆది శ్రీనివాస్

మిగతా 3లో..

## గూగుల్..ఎపికి గేమ్ ఛేంజర్



- పూడి శ్రీహరికి సుప్రీంలో చుక్కెదురు
- ముందస్తు బెయిల్ నిరాకరించిన కోర్టు

మిగతా 3లో..

# రిలయన్స్ ఫ్రాడ్ కేసులో ఇడి దూకుడు




### సుమారు 3034 కోట్ల ఆస్తుల అటాచ్

ముంబై,ఏప్రిల్28 : రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సుమారు 3034 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుకు చెందిన సుమారు 19,344 కోట్లు అటాచ్ చేశారు.అటాచ్ చేసిన ప్రాపర్టీల్లో ముంబైకి చెందిన ఉషా కిరణ్ బిల్డింగ్, ఖండాలాలోని ఫార్మ్‌హౌజ్, అహ్మదాబాద్‌లోని సనాంద్‌లో ఉన్న భూమి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు చెందిన 7.71 కోట్ల విలువైన షేర్లను కూడా జప్తు చేశారు. అనిల్ అంబానీకి చెందిన రైస్ ట్రస్ట్ ఆధీనంలో ఆ గ్రూపు ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పడిన సిట్ బృందం రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు కేసులను మిగతా 3లో..

## నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్



### భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

### ఎన్ఐఎను అప్రమత్తం చేసిన ఇసి

కోల్‌కతా,ఏప్రిల్28 : పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది.రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయ్యింది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ మిగతా 3లో..

## కేజ్రీవాల్ బాటలో సిసోడియా

### హైకోర్టు విచారణకు హాజరుకాబోనంటూ లేఖ



న్యూఢిల్లీ,ఏప్రిల్28 : ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రూట్లోనే ఆ పార్టీ నేత మనీష్ సిసోడియా వెళ్తున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ ముందు హాజరుకాబోనన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం జస్టిస్ స్వరణ కాంతకు లేఖ రాశారు. జస్టిస్ స్వరణ శర్మ కోర్టులో ఈ కేసు ముందు హాజరాకాబోనని కేజీవ్రాల్ సోమవారం ఓ లేఖ రాసిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఆయన హాజరు కాబోనన్నారు. అయితే అదే తరహాలో ఇవాళ సిసోడియా కూడా లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని సిసోడియా పేర్కొన్నారు. న్యాయ పక్రియపై తనకు నమ్మకం లేదన్నారు. ఇంకా ఆయన తన లేఖలో తీవ్ర విమర్శలు కూడా చేశారు. మీ పిల్లల భవిష్యత్తు తుషార్ మిగతా 3లో..

## త్వరలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

### ఐదో దశ సిస్టమ్స్ సరఫరాకు రష్యా అంగీకారం



న్యూఢిల్లీ,ఏప్రిల్28 : రష్యాకు చెందిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ త్వరలో ఇండియాకు రానున్నాయి. ఇవి ఐదో దశ డిఫెన్స్ సిస్టమ్స్. ఇప్పటికే నాలుగోదశ ఎస్400 క్షిపణులు ఇండియాకు చేరాయి. వీటిని ఇండియా గతంలోనే ఉపయోగించింది కూడా. గత ఏడాది పాకిస్తాన్‌పై ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దాడి సమయంలో భారత వాయుసేన.. ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ ను ఉపయోగించింది. ఇప్పుడు ఎస్400 ఐదో దశలో ఇండియాకు అందించేందుకు మిగతా 3లో..


## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి
- షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ,ఏప్రిల్28 : ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, మిగతా 3లో..


## వివాదంలో అషురెడ్డి వ్యవహారం



- పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు
- ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి

మిగతా 3లో..

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్,ఏప్రిల్28 : గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా.. వీటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మంగళవారం హైదరాబాద్ మహానగరంలో భారీ ఎత్తున డ్రగ్స్, విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రా బాద్ రైల్వే స్టేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఇద్దరు మహిళల నుంచి 11.4 కిలోల నిషేధిత అంఫెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి.. విచారణ కోసం డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.11.40 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. సోమవారం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడి వద్ద నుంచి 6.5 కేజీల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 2.15 కోట్లు ఉంటుందని తెలిపారు. డీఆర్ఐ అధికారులు ఇచ్చిన ముందస్తు మిగతా 3లో..

## పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు

- దేశవ్యాప్తంగా కొరతపై పుకార్లు
- పుకార్లను ఖండించిన కేంద్రం
- అలాంటి ఆలోచన లేదని స్పష్టీకరణ




న్యూఢిల్లీ,ఏప్రిల్28 : నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరాలను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నా యంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరిగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ. 2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవా రంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త మిగతా 3లో..

balagamtv100@gmail.com

# శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం



తిరుమల,ఏప్రిల్28 : భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ మురళీకృష్ణ, టిటిడి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్య కార్ల సన్నిధి, యోగా నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో భారత ఉపరాష్ట్రపతికి పండితులు వేదాశీర్వచనం చేయగా.. తితిదే ఛైర్మన్, ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. సోమవారం విశాఖ ఆంధ్రావర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు.

# కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే

- కాళేశ్వరం తదితర విషయాలపై ఎందుకు దాటవేస్తున్నారు
- రైతుల గురించి బిఆర్ఎస్‌ది మొసలి కన్నీరు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్,ఏప్రిల్28 : రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసిందే కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఆలోచన చేయడంతోపాటు, పంటలకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. ఏ రైతునూ కలవని కేసీఆర్‌కు తాము ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పిందెవరని నిలదీశారు. సారు బయటకి రారు.. ఎవరినీ కలవరు.. అని స్వయంగా కేసీఆర్ కుమార్తె అన్నారు. రాష్ట్ర రైతులను పట్టించుకోని కేసీఆర్.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని ఆమె చెప్పారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పని కేసీఆర్.. కాంగ్రెస్‌ను తప్పు పడుతున్నారని మండిపడ్డారు. ముందు ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రూ.2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ ఇవాళ పంజాబ్‌ను అధిగమించింది. ఈ సీజన్‌లో కూడా 8వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. మసిపూసి మారేడుకాయ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటు. ధాన్యానికి బోనస్‌గా రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.3 వేల కోట్లు వేశాం. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధు అమలు చేసి అన్ని పథకాలు నిలిపివేశారు. పంట నష్ట పరిహారం, వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఆపేశారు. ఈ ప్రభుత్వం రైతు భరోసాతోపాటు గతంలోని పథకాలను అమలు చేస్తోంది. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో.. పోస్టుమార్టం చేసుకోవట్లేదు. ఆ పార్టీ నేతలు అహంకార ధోరణిలో ఇంకా ప్రజలనే తప్పుపడుతున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. చేసిన తప్పులను కెసిఆర్ కూతరు కవితే బయట పెట్టారని అన్నారు. కాళేశ్వరం సహా అనేక విషయాల్లో సంధించిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేదని అన్నారు.

# చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

## సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



హైదరాబాద్,ఏప్రిల్28 :ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యాల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని..వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం స్వయంగా వీటిపై దృష్టి సారించాలని కోరారు.

# అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

- 70 నిముషాల్లోనే ప్రయాణం
- చంద్రబాబు విజినరీ లీడర్
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్




విశాఖపట్నం,ఏప్రిల్ 28 : చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి-హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమిషాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు. చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.గతంలో చంద్రబాబు సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కా రంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోటిఫై చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

# గూగుల్..ఎపికి గేమ్ ఛేంజర్

## పూడి శ్రీహరికి సుప్రీంలో చుక్కెదురు

## ముందస్తు బెయిల్ నిరాకరించిన కోర్టు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 28 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోల మార్ఫింగ్ కేసులో మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వోగా పని చేసిన పూడి శ్రీహరికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు, మధ్యంతర ఉపశమనం కలిగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో పూడి శ్రీహరిని రిమాండ్‌కు అప్పగించాలంటూ గతంలో పోలీసులు కుప్పం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులు హైకోర్టును ఆశ్రయించగా.. కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. విచారణకు సహకరించాలని పూడి శ్రీహరిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,ఏప్రిల్ 28 : తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

# పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకో


## కెసిఆర్‌కు ఎంపి మల్లు రవి చురకలు



హైదరాబాద్,ఏప్రిల్28 :పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మరోసారి మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ఫాంహౌస్‌లో ఉండే కేసీఆర్‌కు పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో తెలియనట్లు ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌కు ఆయన హితవు పలికారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని తాము వెంటనే పార్లమెంట్‌లో డిమాండ్ చేశామని మల్లు రవి గుర్తు చేశారు. అలాగే పార్లమెంట్ బయట కూడా కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేశారని అన్నారు. ఇవన్నీ బిఆర్ఎస్ నేతలకు తెలియవా అన్నారు. పార్ల మెంట్‌లో తేజస్వీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రం గా ఖండించిందన్నారు. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన సూచించారు.

# వివాదంలో అషురెడ్డి వ్యవహారం

- పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు
- ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్ 28 : బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొ న్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆలోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తనబాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

## అతివేగంతో పాదచారులను ఢీకొన్న కారు

## ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం

విజయనగరం,ఏప్రిల్28 : పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న గుత్తేదారుల మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగం వల్లే ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన కారు.. పేరాపురం వద్ద దుకాణంలో టీ తాగి రోడ్డుపై ఉన్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో ఆగి ఉన్న లారీ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు.. పాదచారులిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారు చోదకుడితో పాటు తీవ్రంగా గాయపడిన మరొకరిని విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బొబ్బిలి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో విశాఖకు చెందిన ఇరిగేషన్ కాంట్రాక్టరు శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో అమరావతికి చెందిన ఓ న్యాయమూర్తి బంధువులు ఉన్నారని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై దుర్గాప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

# వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం భేటీ



- కొత్త వరివంగడాలను విడుదల చేసిన అధికారులు

ఆదిలాబాద్,ఏప్రిల్28 : కొత్త వరి, సోయా వంగడాలను అధికారులు విడుదల చేశారు. ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. గతేడాది చేపట్టిన విస్తరణ, 2026-2027 సంవత్సరానికి గాను వానాకాలం, యాసంగిలో చేపట్టనున్న కార్యక్రమాలను గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు మాట్లాడుతూ జిల్లాల్లోని వాతావరణ పరిస్థితులు, సాగవుతున్న పంటలు, శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. గతేడాది నిర్వహించిన సమావేశం సిఫారసులపై కార్యాచరణ నివేదికను కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బి.రాంప్రసాద్, ఉత్తర తెలంగాణ మండలాల్లో గతేడాది చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎన్. రాంగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. ఎం, బాల్ రాజ్, విస్తరణ సంచాలకులు డా. యాకాద్రి, వ్యవసాయ మిషనరేట్ ప్రతినిధి అనిత, ఉత్తర వ్యవసాయ విస్తరణ సలహా మండలి సభ్యుడు కె. నరసింహా నాయుడు, తెలంగాణ జిల్లాల వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు


- పెటిఎంలా వాడుకుని వదిలేశారు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తయించారు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి వివేక్



మంచిర్యాల,ఏప్రిల్28 : గత పదేళ్లలో సింగరేణి సంస్థను కేవలం ఒక ఏటీఎంలా వాడుకున్నారే తప్ప, కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదని బిఆర్ఎస్ పాలకులపై మంత్రి వివేక్ మండిపడ్డారు. కొత్త గనుల కేటాయింపులో బీఆర్ఎస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిని గాడిన పెడుతున్నామని.. నేరుగా వేలంలో పాల్గొని కొత్త బొగ్గు గనులను దక్కించు కుంటున్నామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన..రూ.60వేల కోట్ల అప్పుగా ఉన్న తెలంగాణను.. 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని వివేక్ విమర్శించారు. ఇందులో భాగంగానే రామకృష్ణ పూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 మైన్ మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. నాడు సింగరేణికి రావాల్సిన 25 వేల కోట్ల బకాయిలపై నోరు మెదపని కార్మిక సంఘాలు.. నేడు నెలకు 10 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక అట్టర్ ఎలాప్ అని.. అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. గతంలో నడ్డా, అమిత్ షా వంటి వారు అవినీతి జరిగిందని ఆరోపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# తరుగు పేరుతో రైతుల లూటీ

- ఆందోళనకు దిగిన రైతులు



నల్లగొండ,ఏప్రిల్28 : గట్టుప్పల్ మండలంలోని తెరట్పల్లి గ్రామంలో రైతు సేవా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై కూర్చొని రైతులు ధర్నా చేశారు. తేమ, తరుగు పేరుతో క్వింటాకు 8 కిలోలు కోత విధిస్తున్నారని వాపోయారు. ధాన్యం కోత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. లారీలు రాక పోవడంతో మార్కెట్లో ధాన్యం నిల్వలు అలాగే ఉండిపోయాయని.. అకాల వర్షం పడితే రైతులు నష్టపోతారని, వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ధాన్యం తరుగును వెంటనే ఆపాలని, సకాలంలో కొనుగోళ్లు చేయాలని రైతులుడిమాండ్ చేశారు.

# 42శాతంతో జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు

## రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్



హైదరాబాద్,ఏప్రిల్ 28 : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నిక లకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించినప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం, మున్సిపల్‌లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు.

# ఫ్యూచర్ కోసమే..సిటీ నిర్మాణం

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్‌ఆర్‌ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభు త్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థా యిగా నిలిచిపోతారని తెలిపారు.వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభి ంచబోతు న్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యా యని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లు హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమ న్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు.ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పవాల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# సిసి కెమెరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసుఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు.ప్రభుత్వఅరాచకాలనుప్రశ్నిస్తే కేసుపెడతారాఅనిమాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు.

# నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభిం చడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఏకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్‌ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది.

# పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు

కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాటు వేసి.. అతడిని పట్టుకున్నామని కస్టమ్స్ అధికారులు వివరించారు.ఎవరికీ అనుమానం రాకుండా లగేజ్ బ్యాగులో దాచి విదేశీ గంజాయిని తీసుకొచ్చినట్లు తెలిసింది.స్మగ్లర్‌పైఎన్‌డీపీఎస్‌యాక్ట్‌కింద కేసునమోదు చేసిదర్యాప్తుచేపట్టినట్లు కస్టమ్స్‌అధికారులు వెల్లడించారు.

# త్వరలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

రష్యా సిద్ధమైంది.వచ్చే నవంబర్ నెలలోనే ఇవి ఇండియాకు రానున్నట్లు సమాచారం. వచ్చే నెల మధ్యలో నాలుగో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థలు ఇండియన్ పోర్టుకు చేరుకుంటాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇండియా?రష్యాల మధ్య ఉన్న సైనిక సహకారం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్షిపణులు 400 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉన్నాయి. మరోవైపు కొత్తగా ఇంకో ఐదు ఎస్ 400 సిస్టమ్స్ కొనేందుకు కేంద్రం అంగీకరించింది. 400 కిలోమీటర్ల పరిధిలో భారత గగనతలంపైకి దూసుకొచ్చే క్షిపణుల్ని, విమానాల్ని ఇవి ధ్వంసం చేస్తాయి. ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి సింధు నది ప్రాంతం నుంచి వచ్చే గగనతల దాడుల్ని ఇవి అడ్డుకుంటాయి. ఇప్పటికే భారత రక్షణ రంగ అధికారులు రష్యా సందర్శించి ఎస్400 సిస్టమ్స్ తనిఖీ చేశారు. కొత్తగా వచ్చే క్షిపణి విధ్వంసక వ్యవస్థను రాజస్థాన్?లో ఏర్పాటు చేయబోతున్నారు. గతంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థను ధ్వంసం చేసేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. పంజాబ్, గుజరాత్లోని ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ పై దాడికి విఫలయత్నం చేసింది. ఈ సిస్టమ్స్ వల్ల పాకిస్తాన్లోని వైమానిక స్థావరాలు సురక్షితం కాదని ఆ దేశం భావించింది. దీంతో స్థావరాల్ని మార్చేసినట్లు సమాచారం.

# కేజ్రీవాల్ బాటలో సిసోడియా


మెహతా చేతుల్లో ఉందని సిసోడియా వ్యాఖ్యలు చేశారు. సిసోడియా చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థతో పాటు రాజకీయా విభాగాల్లోనే తీవ్ర చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. తన కేసులో న్యాయవాదిని పెట్టుకోను అని, సత్యాగ్రహ బాటలో నడవనున్నట్లు సిసోడియా పేర్కొన్నారు.

# రిలయన్స్ ఫ్రాడ్ కేసులో ఇడి దూకుడు

విచారిస్తున్నది. మనీల్యాండరింగ్‌తో పాటు నిధుల మళ్లింపు, బ్యాంక్ నిధుల దుర్వినియోగం కోణంలో కేసు విచారణ జరుగుతున్నది. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆ కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూపు కంపెనీలు దేశీయ, విదేశీ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నది, ఆ మొత్తం విలువ సుమారు 40,185 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

# తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



**హైదరాబాద్,ఏప్రిల్28:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలువు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్లు డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

# ఇలాగైతే విమానాలను నడపలేం

- విమాన ఇంధన ధరలను అదుపు చేయండి
- వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 :** విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ ) భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది. ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, అలాగే, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలనిల కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్టాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యుయల్ ధరలు పెరిగితే, అంతిమంగా విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై విచారణ

- రాజ్యాంగపరమైన ప్రశ్నలపైనే మాదృష్టి
- ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతప రమైన ఆచారాలపై దాఖ లైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపరమైన విశ్వాసాల మధ్య జరుగు తున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరిం చుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగపరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని, వ్యక్తిగత ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరిం చారు.అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణన లోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

# లొంగిపోయిన మావోలకు పునరావాసం

- పర్యాటక శాఖలో గిరిదర్శక్ గైడ్లుగా శిక్షణ



**హైదరాబాద్,ఏప్రిల్28 :** రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా కర్రెగుట్టలు, భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవం తిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించాయి. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎదుట భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం.. వారిని గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి విమర్శలు

- గూగుల్‌కు శంకుస్థాపన వేళ విపరీత ప్రచారాలు
- తమ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వారే విమర్శలా
- వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి పార్థసారథి

**మచిలీపట్నం,ఏప్రిల్28 :** పెట్రోల్, డీజిల్ సమస్యపై వైసీపీ భయాందోళన పరిస్థితులు సృష్టిస్తోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మండిపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా రాష్ట్రంలో కొరత ఉన్న 75 శాతం బంకుల్లో ఆయిల్ సరఫరా చేశామన్నారు. బుధవారానికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యలపై కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. అంతర్జాతీయ గూగుల్ సంస్థ విశాఖపట్నంలో శంకుస్థాపన జరుగుతున్న వేళ.. అది చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ శాయశక్తులా కృషి చేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం పరిశ్రమలు తెస్తున్నారంటూ వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారని మంత్రి పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయని.. ఇవన్నీ కనిపించడం లేదా? అంటూ వైసీపీ నేతలకు ఈ సందర్భంగా మంత్రి చురకలంటించారు. దేశంలో 25 శాతం పెట్టుబడులు మనరే వస్తున్నాయని వివరించారు. 2019-24లో ఎంత మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారో మీరు మర్చిపోయారా? అంటూ వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతిపక్షమే ఒక పెద్ద దౌర్భాగ్యంగా తయారైందని మండిపడ్డారు. వారికి చట్ట సభల్లో ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. వైసీపీ కావాలనే పానిక్ సిట్యువేషన్ సృష్టిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజలు భయపడి పెట్రోల్, డీజిల్ అధికంగా కొనుగోలు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు రోజూ సమీక్షిస్తున్నారని మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. రైతులకు 6 నెలల్లో ఇవ్వలేని నగదును తాము 48 గంటల్లో ఇచ్చామని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. మొక్కజొన్న రైతుల సమస్యలపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో, మామిడి రైతులకు నష్టం రాకుండా మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణకు రూ.800 కోట్లు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. రైతాంగ వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి.. ప్రస్తుతం మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ వైసీపీ నేతల వైఖరిని మంత్రి పార్థసారథి ఎండగట్టారు. ప్రగల్భాలు మాని.. చిత్తశుద్ధి ఉంటే వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని వైసీపీ నేతలకు మంత్రి పార్థసారథి సూచించారు.

# ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు



- 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా పనులు
- రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు: మంత్రి నిమ్మల

**అమరావతి,ఏప్రిల్28 :** రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం నారా చంద్ర బాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కీలకమైన 11 ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. మంగళవారం అమరావతిలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష జరిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును గెజిట్‌లో చేరుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంలో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో శ్రీకాకుళం జిల్లాలోని నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తితోపాటు ఉత్తరాంధ్రలోని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

**భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**ఎన్ఐఎను అప్రమత్తం చేసిన ఈసీ**

**బలగం టీవి, కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయ్యింది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది.

# పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు ప్రచారం..

**ఖండించిన కేంద్రం**

**అలాంటి ఆలోచన లేదని స్పష్టీకరణ**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరాక్ష్మి-లను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమబెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ.2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నాయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

# గోదావరిఖని శ్రీ కోదండ రామాలయం హుండీ ఆదాయం

# రూ.4.81 లక్షలు

**బలగం టీవి, హైదరాబాద్**

గోదావరిఖని నగరంలోని ప్రముఖ శ్రీ కోదండ రామాలయంలో ఇటీవల నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించి హుండీ ఆదాయం రూ.4,81,746 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బీ. సదయ్య తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం పాలక మండలి చైర్మన్ గట్ల రమేష్ ప్రారంభించారు. ఆలయ అర్చకులు, భక్తులు, సేవా సమితి మహిళలు కలిసి హుండీలోని కానుకలను లెక్కించారు.

దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ పీ. సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో మొత్తం రూ.4.81 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, అశోక్‌తో పాటు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఆంధ్రాలో కొలిక్కి వచ్చిన పెట్రో సమస్య

**సరఫరా యధావిధిగా ఉన్నట్లు ప్రకటన**

**బలగం టీవి, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రోజులుగా ఎదురైన పెట్రోల్, డీజిల్ కొరత సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయానికి రాష్ట్రంలోని సుమారు 90 శాతం పెట్రోల్ బంకుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. సరఫరా మెరుగుపడటంతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ భారీగా తగ్గిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సమస్యను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఇంధన సరఫరాను వేగవంతం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులకు 5,373 కిలోలీటర్ల పెట్రోల్, 8,777 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదే రోజు స్టాక్ పాయింట్ల నుంచి పెట్రోల్ బంకులకు 10,402 కిలోలీటర్ల పెట్రోల్, 17,805 కిలోలీటర్ల డీజిల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం వరకూ ఏపీలోని 100 శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి మెరుగుపడటంతో అధికారులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.




# కృత్రిమ ఇంధన కొరతను అరికట్టాలి

**సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం**

**బలగం టీవి, హైదరాబాద్**

ఆయిల్ కంపెనీలు సృష్టించిన కృత్రిమ ఇం ధన కొరతను వెంటనే అరికట్టాలని, కేంద్ర ప్రభు త్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశా రు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చర్ల పల్లిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీ ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో పి. సత్యం మాట్లాడారు. ఎన్నికల అనం తరం ధరలు పెంచేందుకే ఈ కొరతను సృష్టిస్తు న్నారని ఆరోపించారు. కృత్రిమ కొరత కారణం గా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులతో మూతపడుతున్నాయని తెలిపారు. దీం తో పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక వ్యవ సాయ రంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని, పంటలు చేతికి రాక రైతులు నష్టపోతున్నారని అన్నారు. హైద రాబాద్ నగరంలో ఉపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడి ందని, ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఇంధ నం కోసం గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండా ల్సిన పరిస్థితి ఏర్పడిం దని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాపేక్ష కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

**ప్రధాని మోడీకి ప్రతిపక్షాలను**
**చీల్చడంలో ఉన్న శ్రద్ధ ఇంధన భద్రతపై లేదు..**

దేశంలో చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని చెబుతున్నప్పటికీ కృత్రిమ కొరత ఎందుకు కొనసాగుతోందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. ఇతర దేశాలు ముందుచూపుతో నిల్వలు పెంచుకుంటుంటే, ప్రధాని మోడీకి ప్రతిపక్షాలను చీల్చడంలో ఉన్న శ్రద్ధ ఇంధన భద్రతపై లేదని విమర్శించారు. రష్యా, ఇరాన్ నుంచి చౌకగా చమురు దిగుమతి చేసుకునే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కృత్రిమ కొరతను నివారించి, డిమాండ్‌కు అనుగుణంగా ఆయిల్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, జి.శ్రీనివాసులు, ఎర్ర అశోక్, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, ఎం.శంకర్, బి.లింగస్వామి, నరేష్, సిహెచ్.యాదయ్య, పి.గణేష్, ఎం.ఎస్. రావు, బీవీ సత్యనారాయణ, దేవిరెడ్డి, శరత్, సృజన, సఫీయా, జి.యాదగిరిరావు, బి.నర్సింగ్ రావు, టి.నరసింహ, మణికంఠ, టి.రవీందర్ రెడ్డి, రాంబాబు, లక్ష్మీనారాయణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

**40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి**

**వారణాసిలో ప్రధాని మోడీ**


**బలగం టీవి, వారణాసి**



పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

# మహిళా రిజర్వేషన్‌పై ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వాలి

**-అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్**



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించిన తప్పును సరిదిద్దుకుని, ప్రస్తుత లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, నారీ శక్తి వందన్ అధినియమ్-2023 అమలుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఐక్యతతో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో కేంద్రం కుటిల ప్రయత్నం విఫలమైందని, 2029 నుంచి ప్రస్తుత 543 లోక్‌సభ సీట్లతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమే కాక తప్పనిసరని అన్నారు.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదని, డిలిమిటేషన్ ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే బీజేపీ ఉద్దేశమని జైరాం రమేశ్ ఆరోపించారు. మహిళలను రాజకీయ అజెండా కోసం ఉపయోగించుకున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు వారికి న్యాయం చేయాలని, వర్షాకాల సమావేశాల్లో లేదా అంతకంటే ముందే బిల్లు తీసుకురావాలని కోరారు. ఇటీవల మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు లోక్‌సభలో అవసరమైన రెండొంతుల మెజారిటీ సాధించకపోవడంతో ఆమోదం పొందలేదని తెలిపారు. బిల్లులో లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కు పెంచి, డిలిమిటేషన్ అనంతరం 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రతిపాదించారని గుర్తుచేశారు. మరోవైపు ఒడిశాలోని రాయగడ, కళహండీ జిల్లాల సిజిమాలి ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాల ప్రాజెక్టుపై జరుగుతున్న గిరిజనుల నిరసనలకు మద్దతుగా కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శలు చేశారు. పెసా, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘిస్తూ స్థానిక గ్రామ సభల హక్కులను పక్కనబెట్టి ప్రాజెక్టులు అమలు చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై పోలీసుల అధిక బలప్రయోగం జరిగిందని, ఇది ఎస్సీ/ఎస్టీ చట్ట ఉల్లంఘనకు దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టి గిరిజన హక్కులను పరిరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్**



గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా.. వీటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మంగళవారం హైదరాబాద్ మహానగరంలో భారీ ఎత్తున డ్రగ్స్, విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఇద్దరు మహిళల నుంచి 11.4 కిలోల నిషేధిత అంఫెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి.. విచారణ కోసం డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.11.40 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. సోమవారం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడి వద్ద నుంచి 6.5 కేజీల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 2.15 కోట్ల ఉంటుందని తెలిపారు. డీఆర్ఐ అధికారులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాటు వేసి.. అతడిని పట్టుకున్నామని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా లగేజ్ బ్యాగులో దాచి విదేశీ గంజాయిని తీసుకొచ్చినట్లు తెలిసింది. స్మగ్లర్‌పై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# సింగరేణికి బకాయిలు వెంటనే చెల్లించాలి




**విద్యుత్ సౌధా వద్ద కార్మికుల ధర్నా**

**బలగం టీవి, హైదరాబాద్**

సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు రూ.46 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌద కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సింగరేణి ప్రాంతంలోని రామగుండం, శ్రీరాంపూర్, మందమర్రి, కొత్తగూడెం, మణుగూరు తదితర బ్రాంచ్ నుంచి కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎండలను సైతం లెక్క చేయకుండా సుదూర ప్రాంతాల నుంచి సంస్థ పరిరక్షణ కోసం సీఐటీయూ హైదరాబాద్‌లో ధర్నా చేయడం విశేషం. ఈ ధర్నాకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ అధ్యక్షత వహించగా.. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ధర్నానుద్దేశించి మాట్లాడారు. సింగరేణికి ఇవ్వాల్సిన బకాయిలు, విద్యుత్ సంస్థల ద్వారా ప్రభుత్వం చెల్లించే విధంగా చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. సింగరేణి కార్మికుల పోరాటానికి మద్దతిచ్చారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల సింగరేణి దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. సంస్థకు చెల్లించాల్సిన రూ.46 వేల కోట్లు ఇవ్వకపోవడంతో సంస్థ ఉద్యోగుల వేతనాల కొరత ఏర్పడిందన్నారు. సంక్షేమ పథకాలు, స్పేర్ పార్ట్స్, రక్షణ పరికరాలు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం బకాయిలు చెల్లించకపోతే అన్ని సంస్థలతో కలిసి ఐక్య ఉద్యమం ఉదతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొంది లాభాలు ఆర్జిస్తున్న సింగరేణి సంస్థను ఆర్థికంగా నిర్వీర్యం చేసి ప్రయివేటు వారికి అప్పగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదన్నారు. సింగరేణి కరెంటును యూనిట్‌కు రూ.5.15కి కొని డబ్బులు చెల్లించడం లేదన్నారు. బొగ్గు సరఫరాకు డబ్బులు చెల్లించక దివాళా తీయిస్తుందన్నారు. గౌరవాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ సింగరేణి డబ్బులను భట్టి విక్రమార్క మధిర అభివద్ధికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివద్ధికి, ఎమ్మెల్యేలు, ఎంపీల నియోజకవర్గాలకు, ఇతర సంక్షేమ పథకాలకు వాడుతున్నారనీ, కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం టీఎస్ జెన్ కో చైర్మెన్ అండ్ ఎండీ ఎస్.హరీష్‌ను యూనియన్ ప్రతినిధి బందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. జెన్‌కో బకాయిలు సింగరేణికి రూ.19వేల కోట్లు ఉన్నది వాస్తవమని, ప్రతినెలా రూ.200 కోట్లు చెల్లించే విధంగా చర్చిస్తున్నామన్నారు. త్వరలో మంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చైర్మెన్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇల్లి రాజేందర్, వెంకట్ స్వామి, బాలాజీ, కొమరయ్య, ప్రసాద్, సారయ్య, మెండె శ్రీనివాస్, సాయిరెడ్డి, వై. వెంకటేశ్వరరావు, సాయి కష్ణ, వెంకటరత్నం, లక్ష్మణరావు, ఇ.కుమార్, ఎం. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- అధికారులు సమన్వయంతో పనిచేయాలి:**

**జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల**

**బలగం టీవి, హైదరాబాద్**

జిల్లా ప్రజలకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలని, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రెవెన్యూ విభాగాల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు జియో-కోఆర్డినేట్ ట్యాగింగ్, పెగ్ మార్కింగ్ చేపట్టాలని, ఆక్రమణలపై తహసీల్దార్లు కఠినంగా ఉండాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే 85 శాతం ఇండ్ల దరఖాస్తుల ధృవీకరణ పూర్తయిందని, మిగిలినవి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్యారాడైస్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. మీ-సేవ ద్వారా వచ్చే కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, టీఎస్-బీపాస్ భవన అనుమతులు, 'ప్రజావాణి' ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, ఎక్స్‌పార్టీ ఉత్తర్వులు రాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. పరిపాలనలో ఆలస్యం వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి 15 రోజులకు ఒకసారి పురోగతిని సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణ, పీడీ హౌసింగ్ అశోక్ చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ అపర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూ పరిమితి శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జ్యోతి, ల్యాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లావణ్య, హైదరాబాద్ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో విజయలక్ష్మి, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, అన్ని మండలాల తహసీల్దార్లు సమావేశంలో పాల్గొన్నారు.



**నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి**

జిల్లాలో నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పరీక్షా ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. వచ్చేనెల 3న మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరగనున్న పరీక్షకు జిల్లాలోని 69 కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 28,702 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి అభ్యర్థులను అనుమతిస్తామనీ, మధ్యాహ్నం 1:30గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరన్నారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, ఐడీ ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. నిషేధిత వస్తువులకు అనుమతి లేదన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, నిరంతర విద్యుత్, పారిశుధ్యం, వికలాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీధర్, డీఈవో రోహిణి, ఏసీబీ జి.లక్ష్మణ్, సూపరిటెండెంట్ మహేందర్ రెడ్డి, అధికారులు, నీట్ కో-ఆర్డినేటర్లు, సెంటర్ సూపరిటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో అరుదైన సంఘటన
## 5.1 కిలోల బరువుతో మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ..

● వాణి హాస్పిటల్ లో 5 కిలోల 100 గ్రాముల బరువుతో మగబిడ్డ.. నార్మల్ డెలివరీ..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని వాణి హాస్పిటల్‌లో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. సోమవారం రోజున డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో నార్మల్ డెలివరీ ద్వారా దివ్యభారతి భర్త శ్రీకాంత్ అనే మహిళ 5 కిలోల 100 గ్రాముల బరువుతో ఆరోగ్యవంతమైన మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇంత పెద్ద బరువుతో ఉన్న శిశువు నార్మల్ డెలివరీ ద్వారా జన్మించడం వైద్య రంగంలో ప్రత్యేకంగా నిలిచింది. తల్లి మరియు బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఈ సందర్భంగా దివ్యభారతి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, విజయవంతంగా డెలివరీ నిర్వహించిన డాక్టర్ శ్రీవాణి మరియు వైద్య సిబ్బందిని అభినందించారు.అనంతరం మానెరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ మాట్లాడుతూ.. డాక్టర్ శ్రీవాణి, వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. నార్మల్ డెలివరీలు తల్లి, శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, వీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్క డాక్టర్ గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.

## సిరిసిల్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

● వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొత్త బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో మంగళవారం (28-04-2026) ఉదయం సుమారు 09.00 గంటల సమయంలో గుర్తు తెలియని ఒక మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల సమాచారం ప్రకారం, మృతుని వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అంచనా. మృతుడు సుమారు 5 అడుగులు 6 అంగుళాల ఎత్తు కలిగి, గుండ్రటి ముఖం, చామనచాయ వర్ణంతో ఉన్నాడు. అతడు ఎరుపు రంగు చొక్కా, గ్రీన్ రంగు ప్యాంటు మరియు గ్రీన్ రంగు బనియన్ ధరించి ఉన్నాడు. ప్రత్యేక గుర్తులుగా, ఎడమ చేతిపై "సుజాత" అని, కుడి చేతిపై "హ.నా" అని పచ్చబొట్లు ఉన్నాయి.

మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరచారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసిన పక్షంలో వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. సంప్రదించవలసిన నంబర్లు: ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చీ. శ్రీనివాస్ -- 8712656366, సబ్-ఇన్స్పెక్టర్ చ. శ్రీకాంత్ -- 8712656368



## క్రేన్ కూలిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం..

### అంగీకరించిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ

**బలగం టీవీ, హైదరాబాద్:**

హైదరాబాద్ శివారులోని శంకరపల్లి మండలంలో చోటుచేసుకున్న విషాదకర క్రేన్ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిర్మాణ పనుల సమయంలో క్రేన్లు కుప్పకూలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం.

ఈ ఘటనపై స్పందించిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని కంపెనీ ప్రకటించింది. అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున సాయం అందజేస్తామని తెలిపింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు.



## సిరిసిల్లలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల పంపిణీ

### యువతకు క్రీడల్లో ప్రోత్సాహం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొని కిట్లను మంగళవారం రోజున పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో 15 రోజులపాటు నిర్వహించిన "కేసీఆర్ కప్--2026" క్రికెట్ టోర్నమెంట్‌లో సిరిసిల్ల పట్టణం నుంచి పాల్గొన్న 20 జట్లకు క్రికెట్ కిట్లను అందజేయడం జరిగిందని తెలిపారు. యువతను క్రీడారంగంలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక శాసనసభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు ఆలోచనల మేరకు ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు వివరించారు. సిరిసిల్ల పట్టణంలోని 39 వార్డుల నుంచి 20 జట్లను ఏర్పాటుచేసి మున్సిపల్ స్థాయి పోటీలను నిర్వహించగా, అందులో విజేతగా నిలిచిన "సిరిసిల్ల డాల్ఫిన్స్" జట్టు రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని "కేసీఆర్ కప్--2026" ట్రోఫీని గెలుచుకుందని తెలిపారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 20 జట్లకు గౌరవ బహుమతులుగా క్రికెట్ కిట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించబడతాయని, క్రికెట్‌తో పాటు కబడ్డీ, వాలీబాల్ వంటి ఇతర క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### సాంకేతికతను వినియోగించుకుని
# దొంగతనం కేసులు చేధించాలి..

● కేసులలో సమగ్ర విచారణ చెప్పట్టి నిందుతులకు శిక్షలు పడేవిధంగా కృషి చేయాలి.

● ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పిల్లల రక్షణ,డ్రగ్స్ అడ్డుకట్టపై విస్తృతంగా అవగాహన కల్పించాలి.

● జిల్లా ఎస్పి మహేష్ బి.గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును ఎస్పీ మహేష్ బి.గితే సమగ్రంగా సమీక్షించారు.

ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎస్పీ వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నమోదైన ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి నిందుతులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని,పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలన్నారు. ప్రాసిక్యూషన్లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను తప్పించుకుని తిరుగుతున్న నిందితులపై పకడ్బందీగా అమలు చేయాలనలన్నారు. దొంగతనాల నివారణ,కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని కేసులు చేదించి రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తు ప్రజలను, వ్యాపారస్థులను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా నిర్వహిస్తున్న వారోత్సవాల సందర్భంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలు, అలాగే పిల్లల రక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ చేసే సమయాల్లో ఆకస్మికంగా రౌడి , హిస్టరీ షీట్స్ కలిగి ఉన్న వారిని తనిఖీ చేయాలని ఆదేశించారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలనిమద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కరణం అయ్యే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ..

● లబ్దిదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని అధికారుల ఆదేశం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

బాలల భద్రత మరియు డ్రగ్ రహిత తెలంగాణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి ఈ. లక్ష్మీరాజం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట 7వ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన అధికారి, గర్భిణీలు, బాలింతలు మరియు ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న ఆహార సరుకుల నాణ్యతను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా కోడిగుడ్ల పరిమాణం, నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు ఇతర ఆహార పదార్థాల పరిమాణం, నిల్వ విధానాలను పరిశీలించారు. అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ప్రతి లబ్ధిదారుడు టిఫిన్ బాక్స్ రూపంలో ఆహారం ఇంటికి తీసుకెళ్లకుండా అంగన్వాడీ కేంద్రంలోనే భోజనం చేయించే విధంగా "స్పాట్ ఫీడింగ్" నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎలాంటి అక్రమాలు, నిర్లక్ష్యాలు గమనించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.



# దళిత క్రైస్తవుల హక్కులకై పోరాటం చేయాలి..



● ప్రొఫెసర్ నతానియల్

**బలగం టీవీ, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేట గ్రామంలోని చర్చ్ లో రాజన్న సిరిసిల్ల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్స్ జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతనియల్ హాజరై మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దళిత క్రైస్తవులకు తీవ్ర అన్యాయం చేకూరే విధంగా ఉందని క్రైస్తవులు అందరూ హక్కుల సాధనకై ఉద్యమాన్ని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. 1950 జీవోను వెంటనే రద్దుచేసి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని అన్నారు. దళిత క్రైస్తవులు రాజ్యాధికారం చేరకూడదనే ఉద్దేశంతో కుట్రలు చేస్తున్నారని దానిలో భాగంగానే దళిత క్రైస్తవులకు బిసిసి లో చేరుస్తూ దళిత క్రైస్తవులకు చెందవలసిన హక్కులను సుప్రీంకోర్టు తీర్పు ద్వారా కాలరాస్తున్నారని అన్నారు. క్రైస్తవ సంఘాలు అందరూ నిరసనలు తెలియజేస్తూ కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. క్రైస్తవులందరూ ఐక్యతతో ఉన్నప్పుడు మాత్రమే హక్కులను సాధించుకోగలుగుతామని సూచించారు. జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరాటి శ్రీనివాస్, మూలే కిషోర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్, ఉపాధ్యక్షుడు దేవయ్య, ఎలీషా, జిల్లా మీడియా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్,జిల్లా సహాయ కార్యదర్శి జోసెఫ్, నతానియల్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆహారోను, ప్రసాద్, దేవానంద్, స్టీరింగ్ కమిటీ సభ్యులు తిమోతి, క్రీస్తు దాస్, పౌల్, పాస్టర్లు కులేరి దీప్తి కుమార్, ఆనంద్, ప్రశాంత్, సుమారు 100 మంది పాస్టర్లు పాల్గొన్నారు.

# పిల్లల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి బాధ్యత..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

ప్రజా పాలన --ప్రగతి ప్రణాళికలో భాగంగా పిల్లల భద్రత మరియు డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రోజు సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ యువతకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, పిల్లల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన నేటితరం యువతను మాదకద్రవ్యాల నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకి బాటలు వేసుకోవలని,యువతి యువకులు తమ ఆలోచన విధానాన్ని క్రీడలు, చదువు మరియు ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే 8712671111 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.



# బీఆర్ఎస్‌పై విమర్శలు చేసే నైతిక అర్హత సీఎంకు లేదు..




కంచర్ల రవి గౌడ్ ఫైర్

**బలగం టీవీ, సిరిసిల్ల:**

బిఆర్ఎస్ పార్టీపై ముఖ్యమంత్రి చేస్తున్న విమర్శలు రాజకీయ దివాళా తనానికి నిదర్శనమని టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన ప్రస్తుత ప్రభుత్వం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ పార్టీపై నిరాధార ఆరోపణలు చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బిఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు ముఖ్యమంత్రికి లేదని స్పష్టం చేశారు. ప్రజల కోసం పుట్టిన పార్టీని కించపరచడం ద్వారా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలకు ప్రజలు తగిన సమయంలో గట్టి సమాధానం ఇస్తారని హెచ్చరించిన కంచర్ల రవి గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ తెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె అప్రోచ్ ఆరేల్లి వినయ్ కుమార్ శ్రీనివాస్ సాయి శ్రీకర్ వినయ్ నరేష్ రాము వినయ్ యశ్వంత్ దామోదర్ అనిల్ భాను రాము తదితరులు పాల్గొన్నారు..

## సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అడ్మిషన్ ప్రచారంలో భాగంగా ఇందిరమ్మ కాలనీ సందర్శన

**నవతెలంగాణ -- సిరిసిల్లలి**

సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సిరిసిల్ల అధ్యాపక బృందం అడ్మిషన్ల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీని సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి గడ్డం రచన మధుకర్, ఉపసర్పంచ్ కొండ శ్రీకాంత్‌లను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

కళాశాల అధ్యాపక బృందం కళాశాల ప్రత్యేకతలు, విద్యా ప్రమాణాలు, గత పరీక్షా ఫలితాలు, అందిస్తున్న సౌకర్యాలపై గ్రామ ప్రజలకు వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రచన మధుకర్ మాట్లాడుతూ తాను 2013--2015 విద్యా సంవత్సరంలో ఇదే సెస్ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఎంపీసీ గ్రూప్ చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించానని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించడం తన విద్యకు నిదర్శనమని పేర్కొంటూ, ప్రతి విద్యార్థిని నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని సూచించారు. తనకు విద్యాబోధన చేసిన కళాశాల అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రత్యేకంగా సన్మానించడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొండ శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు నవీన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, కె. సునీత, ఆఫ్రోజ్ సుల్తానా, ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.



# ఓయూలో ఒంటికి నిప్పంటించుకున్న విద్యార్థి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉస్మానియా యూనివర్సిటీలో పెట్రోల్ పోసుకుని ఒంటికి నిప్పంటించుకున్న విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. మహబూబాబాద్ జిల్లా పెద్దగుడూర్ మండలం గోవిందపురం తండాలో వీరన్న, మంగ్లీ దంపతుల కుమారుడు బొడ వినీష్ కుమార్(19) హైదరాబాద్ ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో మైనింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో లేడీస్ హాస్టల్ సమీపంలో అతను తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించగా తీవ్ర గాయాలతో ఉన్న అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే శరీరం సుమారు 60 శాతం కాలిపోవడంతో వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించక రాత్రి 11 గంటల సమయంలో అతడు కన్నుమూశాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రేమ వ్యవహారమే ఈ విషాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.వినీష్ మృతితో కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులు, మైనింగ్ విభాగ అధ్యాపకులు విషాదంలో మునిగిపోయారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. మంగు, వార్డెన్ డా. ఎం. శ్రీనివాస్ ఆస్పత్రిలో ఉండి తదుపరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.




# పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలనీ, కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ' సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏజెన్సీ నిర్వాహకులు, డిస్ట్రిబ్యూటర్లతో ప్రస్తుత నిల్వలు, సరఫరా పరిస్థితులపై సమీక్షించారు. ప్రభుత్వ వాహనాలు, అంబులెన్సులు, ఫైర్ టెండర్లు, తాగునీటి సరఫరా వాహనాలకు ఇంధన కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చర్లపల్లి, ఘట్‌కేసర్ టెర్మినల్ నిర్వాహకులతో మాట్లాడి జిల్లాకు అవసరమైన పెట్రోల్, డీజిల్ నిల్వలు సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం ట్యాంకర్ల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు.

హైదరాబాద్ వ్యాప్తంగా రోజుకు సగటున 8.61 లక్షల లీటర్ల పెట్రోల్ అవసరం ఉండగా, ఈనెల 27న(సోమవారం) ఒక్కరోజే 11 లక్షల లీటర్ల సరఫరా జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే డీజిల్ వినియోగం సాధారణం కంటే ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 185 పెట్రోల్ బంకులు, 69 ఎల్పీజీ కేంద్రాలు, 55 ఆటో ఎల్పీజీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో పారదర్శకత ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సిలిండర్ కనెక్షన్ ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సిలిండర్ అందిన తర్వాతే రెండో సిలిండర్ కేటాయింపులు చేయాలని ఆదేశించారు. డబుల్ బుకింగ్స్, అనవసర బుకింగ్స్ ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టాలని గ్యాస్ ఏజెన్సీలకు సూచించారు. సివిల్ సప్లైస్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించవద్దన్నారు. బంకుల వద్ద, రవాణా వాహనాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారా పెంచాలని సూచించారు.

ఇంధన కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను, అపోహలను ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కోరారు. అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. భయాందోళనలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ రాజిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, ఆర్డీవో పురుషోత్తమ రెడ్డి, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

**బలగం టీవి, హైదరాబాద్**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం కార్పొరేషన్ వ్యాప్తంగా ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఫాతుల్లాగూడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని కమిషనర్ సందర్శించి శిబిరం నిర్వహణను పరిశీలించారు. వీధి కుక్కల దత్తత కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జంతువులకు సమయానికి వ్యాక్సినేషన్ చేయించడం అత్యంత అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజలు తమ పెంపుడు కుక్కలను తీసుకువచ్చి టీకాలు వేయించగా, పశువైద్య సిబ్బంది యజమానులకు అవసరమైన సూచనలు అందించారు. ప్రజలు తమ పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలనీ, కార్పొరేషన్ చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# చిన్నారులకు వేసవి శిక్షణా శిబిరాలు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిన్నారులు, యువత కోసం వివిధ సర్కిళ్లలో సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులను కేవలం వినోదంతో కాకుండా ఆరోగ్యకరమైన కార్యకలాపాలతో గడపాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో క్రీడా నైపుణ్యంతోపాటు శారీరక దఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. ప్రస్తుత కాలంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, టెలివిజన్ వంటి వాటికి పరిమితం కాకుండా క్రీడల వైపు మళ్లేందుకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతి కేంద్రంలో ఆయా క్రీడలకు సంబంధించిన ప్రాథమిక అంశాల నుంచి మెరుగైన నైపుణ్యాల వరకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ముఖ్యంగా ఏఎస్ రావు నగర్ హుడా పార్క్‌లో కరాటే, రోలర్ స్కేటింగ్, మల్లాపూర్‌లో కరాటే శిక్షణ, ఎదులాబాద్‌లో వాలీబాల్ కోచింగ్, బోయిన్‌పల్లిలో కిక్ బాక్సింగ్ శిక్షణ, నాగారం వార్డులో క్రికెట్ కోచింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న చిన్నారులు శిక్షకుల సూచనలతో ఆసక్తిగా అభ్యాసం చేస్తుండగా, తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంపై సంతప్తి వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిక్షణా శిబిరాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది.

# ఇంధన సరఫరా 126 శాతం పెంపు

**పెట్రోల్ బంకుల వద్ద రద్దీ నియంత్రణకు పౌర సరఫరాల శాఖ అత్యవసర చర్యలు**

**బలగం టీవి, హైదరాబాద్**




రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా పౌరులకు ఇంధనం నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఆదివారం నుంచి పెట్రోలియం సరఫరాలను 126 శాతం మేర భారీగా పెంచింది. అకస్మాత్తుగా పెరిగిన అసాధారణ డిమాండ్‌తో స్థానిక పెట్రోల్ బంకులపై ఏర్పడిన ఒత్తిడిని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

పెట్రోల్ పంపుల వద్ద పెరిగిన రద్దీకి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పారిశ్రామిక డీజిల్ ధర లీటరుకు రూ.150కు పెరగడంతో బల్క్ వాణిజ్య వినియోగదారులు సాధారణ పబ్లిక్ పెట్రోల్ బంకుల వైపు మళ్లడం ఒక కారణమైతే, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో సరఫరా సమస్యల కారణంగా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నిర్మల్ ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల వాహనదారుల రద్దీ పెరగడం మరో కారణంగా మారింది. అదనంగా ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే తప్పుడు ప్రచారం కారణంగా ప్రజలు అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసేందుకు ప్రయత్నించడం వల్ల కూడా డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ఇంధన ట్యాంకర్లను మోహరించి, డీలర్ల నుంచి ముందస్తు ఇండెంట్లు స్వీకరిస్తూ సరఫరా వ్యవస్థను మరింత వేగవంతం చేశారు.

ఇంధన నిల్వలు ఎక్కడా తగ్గిపోకుండా ప్రతి మూడు గంటలకు అన్ని రిటైల్ అవుట్‌లెట్ల నుంచి స్టాక్ వివరాలు సేకరిస్తూ, రోజువారీ టెలికాన్ఫరెన్సుల ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రైతుల అవసరాలకు అంతరాయం కలగకుండా పంట కోత, వరి సేకరణ ప్రాంతాల్లో ఇంధన సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ చర్యల ఫలితంగా ఏప్రిల్ 27 నాటికి రాష్ట్రవ్యాప్తంగా డీజిల్ పంపిణీ 151 శాతం పెరిగి రోజుకు 7,348 కిలోలీటర్ల నుంచి 18,449 కిలోలీటర్లకు చేరింది. పెట్రోల్ పంపిణీ కూడా 95 శాతం పెరిగి 5,883 కిలోలీటర్ల నుంచి 11,490 కిలోలీటర్లకు పెరిగింది.

హైదరాబాద్‌లో ఇంధన సరఫరా మొత్తం 43 శాతం పెరిగింది. నగరంలో డీజిల్ నిల్వలు 46 శాతం పెరిగి 3,393 కిలోలీటర్ల నుంచి 4,957 కిలోలీటర్లకు చేరగా, పెట్రోల్ నిల్వలు 40 శాతం పెరిగి 3,908 కిలోలీటర్ల నుంచి 5,466 కిలోలీటర్లకు చేరాయి.తెలంగాణలో ఎలాంటి ఇంధన కొరత లేదని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రజలు వదంతులను నమ్మకుండా అవసరమైన మేరకే ఇంధనం కొనుగోలు చేయాలని, రాష్ట్రంలో ప్రజలతో పాటు వ్యవసాయ అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

హెల్ప్‌లైన్: 1967

# జిల్లా రైతుల పట్ల కలెక్టర్ నిర్లక్ష్య వైఖరి అత్యంత శోచనీయం..

- **ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ లోపాలపై ఎఐకెఎస్ తీవ్ర ఆగ్రహం**
- **తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్**

**బలగం టీవీ, జనగామ:**



జిల్లావ్యాప్తంగా ధాన్యం సేకరణ తన గుప్పెట్లో పెట్టుకుని రవాణా కాంట్రాక్టర్, గన్ని బ్యాగుల కాంట్రాక్టర్, మరియు మిల్లర్లకు రావాల్సిన గత సంవత్సరాల బకాయి మిల్లింగ్ బిల్లులో 18 కోట్లను రిలీజ్ చేయపోవడంతో మిల్లర్లు ధాన్యం దిగుమతి చేయక పోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ విమర్శించారు.

జనగామ జిల్లా కలెక్టర్ అనునిత్యం దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నట్టు ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప సమస్యలు పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికంగా ఉండే సమస్యలను అర్థం చేసుకోకుండా చట్టాలు అన్ని పనులు చేస్తాయని భావిస్తూ ఉండడం వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారు నెలరోజుల అవుతున్నప్పటికీ నేటికీ రవాణా సౌకర్యం ట్రాన్స్పోర్ట్ పూర్తిస్థాయిలో లారీలు అందుబాటులో లేకపోవడంతో దాన్యం కాంట పూర్తయినప్పటికిని సెంటర్ల వద్ద రోజుల తరబడి నిల్వ ఉండడం వలన గన్ని బ్యాగులు పూర్తిగా చెదలు పట్టిపోతున్నాయని మరియు కాంట పూర్తయిన తర్వాత లిఫ్టింగ్ చేయకపోవడంతో వెయిట్ లాస్ అవుతుందని, జిల్లా కలెక్టర్ వ్యవహార శైలి వలన మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. పొట్టి రకం దాన్యం పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధర తగ్గిస్తున్నారని రైతుల వద్ద డబ్బులు వసూలు చేయడం చట్ట విరుద్ధమని అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పరిశీలించి సాధారణ రకం ధాన్యాన్ని గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, రమావత్, మీట్యా నాయక్, ఆత్కూరు ఎల్లయ్య, తాండ్ర ఆనందం, పురుషుల కుమార్, రైతులు, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# మంకు రాజయ్య ఆలోచనలు ముందుకు తీసుకెళ్తాం..



- **మంకు రాజయ్య లేని లోటు తీరనది..**
- **ఆంగ్ల మాధ్యమానికి ఆద్యుడు మంకు రాజయ్య**
- **విద్యా సంఘసంస్కర్త మంకు రాజయ్య**
- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మంకు రాజయ్య 5వ వర్ధంతి సందర్భంగా మంగళవారం (28-04-2026) ఆయన స్మారక విగ్రహం వద్ద సహచరులు, ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమానికి ఆద్యుడు, గొప్ప విద్యా సంఘసంస్కర్తగా మంకు రాజయ్య నిలిచారని కొనియాడారు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి, మండల విద్యాధికారిగా ఎదిగి జాతీయ ఉత్తమ విద్యాధికారిగా గుర్తింపు పొందిన మహానుభావుడని అన్నారు.

ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థుల సంఖ్యను పెంచిన ఘనత మంకు రాజయ్యకే చెందుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి తన ప్రతిభను చాటారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి మంకు రాజయ్య ఆలోచనే స్ఫూర్తిగా నిలిచిందని, అప్పటి మంత్రి కేటీఆర్ కూడా ఆయన సేవలను ప్రశంసించారని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వామపక్ష భావజాలం కలిగిన మహోన్నత వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడిగా కూడా మంకు రాజయ్యను గుర్తుచేశారు. ఆయన లేని లోటు తీరనిదని, ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు సహచర ఉద్యమకారులుగా ముందుంటామని పర్శ హన్మాండ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లకావత్ శర్మ నాయక్, నాయకులు సింగం ప్రసాద్, డిప్యూటీ ఎమ్మార్వో బుర్కా గోపాల్, మైలారం తిరుపతి, కిషన్, గుర్రం దేవదాస్, మధుసూదన్, పంజాల వెంకటేశ్వర్లు, శ్రీధర్, గణేష్, రామదాస్, అమర్, గంగారం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మనువాద విధానాలను తిప్పికొట్టాలి

**రాజ్యాంగ పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి**

**ఆవాజ్, ఎన్‌పీఆర్‌డీ నేతలు**

**బలగం టీవి, హైదరాబాద్**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మనువాద, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు సమష్టిగా పోరాటాలకు సిద్ధం కావాలని అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య పిలుపునిచ్చారు.

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్ అధ్యక్షతన పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా "రాజ్యాంగ పరిరక్షణ -- సవాళ్లు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి మనిషికి సమాన విలువ, సమాన హక్కులు కల్పించిందని, అయితే బీజేపీ పాలనలో కుల, మత, వర్ణ వివక్షతలను ప్రోత్సహించే విధానాలు అమలవుతున్నాయని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, సమాజంలో విభజనలు సృష్టిస్తూ సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ రిజర్వేషన్ల వ్యవస్థను బలహీనపరుస్తున్నారని, ప్రభుత్వ రంగ రిజర్వేషన్లను కాపాడుకోవడంతో పాటు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాలు అవసరమని పేర్కొన్నారు. వికలాంగులు, దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని, ఖాళీగా ఉన్న రిజర్వేషన్ పోస్టులను భర్తీ చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న మనువాద సిద్ధాంతం వికలాంగులను సమాజానికి దూరం చేసే ప్రమాదకర విధానమని అన్నారు. వికలాంగుల హక్కులు, విద్య, సామాజిక అవకాశాలను హరించే ఈ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మత, కుల వైషమ్యాలను రెచ్చగొట్టి ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే రాజకీయాలను తిప్పికొట్టాలని అన్నారు.

రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, వికలాంగులకు రాజ్యాంగబద్ధ హక్కులు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఇంకా వివక్ష కొనసాగుతుండటం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి. శశికల, చంద్రమోహన్, బాలకృష్ణ, నర్సింహా, చెన్నయ్య, వెంకన్న, కవిత, దుర్గ, గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజు, జిల్లా నాయకులు ఉషా, నర్సింగ్, శంకర్ గౌడ్, రవిచంద్ర, లక్ష్మణ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పంజాబ్ విజయాలకు బ్రేక్!

- దూబే, ఫెరీరా విధ్వంసం.. రాయల్స్ ఘనవిజయం
- వరుస ఆరు విజయాల తర్వాత పంజాబ్‌కు తొలి ఓటమి
- మెరిసిన యశస్వీ, సూర్యవంశీ; పోరాడిన స్టోయినిస్






**బలగం టీవీ, ముల్లన్‌పూర్**

ఐపీఎల్-19లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు రాజస్థాన్ రాయల్స్ షాకిచ్చింది. భారీ లక్ష్యాలను ఛేదిస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్‌ను వారి సొంత గడ్డపైనే రాజస్థాన్ మట్టికరిపించింది. డొనొవాన్ ఫెరీరా (52 నాటౌట్), ఇంపాక్ట్ ప్లేయర్ శుభం దూబే (31 నాటౌట్) ఆఖర్లో శివతాండవం చేయడంతో 223 పరుగుల భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ మరో వికెట్ మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ పట్టికలో మూడో స్థానానికి చేరుకోగా, పంజాబ్‌కు ఈ సీజన్‌లో ఇదే తొలి ఓటమి.

223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (43) తొలి ఓవర్లోనే అర్షదీప్ సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని 6, 4, 4 బాది తన ఉద్దేశాన్ని చాటాడు. మరోవైపు యశస్వీ జైస్వాల్ (51) క్లాస్ షాట్లతో అలరించాడు. వీరిద్దరి ధాటికి రాజస్థాన్ కేవలం 20 బంతుల్లోనే 51 పరుగులు రాబట్టింది. అయితే, అర్ధశతకానికి చేరువైన దశలో వైభవ్ అవుట్ కాగా, అనంతరం వచ్చిన ధ్రువ్ జురెల్, కెప్టెన్ రియాన్ పరాగ్ తక్కువ వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. లెగ్ స్పిన్నర్ చాహల్ కీలక వికెట్లు తీసి పంజాబ్‌ను రేసులోకి తెచ్చాడు.వికెట్లు పడుతున్నా వెనక్కి తగ్గని డొనొవాన్ ఫెరీరా, శుభం దూబే జోడీ పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. ముఖ్యంగా 18వ ఓవర్లో అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఫెరీరా సిక్సర్, ఫోర్ కొట్టగా.. దూబే ఆఖరి బంతిని స్టాండ్స్‌లోకి పంపి సమీకరణాన్ని మార్చేశాడు. ఫెర్గూసన్ వేసిన 19వ ఓవర్లోనూ ఫెరీరా ఫోర్, సిక్సర్‌తో విరుచుకుపడటంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. ఆఖరి ఓవర్లో యాన్సెన్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఫెరీరా తన హాఫ్ సెంచరీని పూర్తి చేయడమే కాకుండా, జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59) దూకుడుగా ఆడగా.. మధ్యలో కూపర్ కొన్నొల్లీ (30), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (30) రాణించారు. ఆఖర్లో మార్కస్ స్టోయినిస్ (62 నాటౌట్) సిక్సర్ల వర్షం కురిపించాడు. బ్రిజేశ్ శర్మ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో 4, 6, 6 బాది తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పంజాబ్ బ్యాటర్లు భారీ స్కోరు చేసినప్పటికీ, రాజస్థాన్ బ్యాటర్ల ధాటికి బౌలర్లు తలవంచక తప్పలేదు.

**సంక్షిప్త స్కోర్లు**

పంజాబ్ కింగ్స్:లిలి 222/4 (స్టోయినిస్ 62లి, ప్రభ్‌సిమ్రన్ 59)

రాజస్థాన్ రాయల్స్:లిలి 223/4 (ఫెరీరా 52లి, జైస్వాల్ 51, సూర్యవంశీ 43)

ఫలితం: రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం.




# ఉబెర్ కప్‌లో ముగిసిన భారత్ కథ..!

- చైనా చేతిలో 0-5తో ఘోర పరాజయం
- సింధు పోరాడినా దక్కని విజయం.. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమణ
- థామస్ కప్‌లో జోరు కొనసాగిస్తున్న పురుషుల జట్టు

**బలగం టీవీ, బీజింగ్**

ఉబెర్ కప్-2026 టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు ప్రస్థానం నిరాశాజనకంగా ముగిసింది. సోమవారం గ్రూప్-ఏలో భాగంగా జరిగిన నిర్ణయాత్మక పోరులో పటిష్టమైన చైనా జట్టు భారత్‌ను 5-0తో క్లీన్ స్వీప్ చేసింది. క్వార్టర్ ఫైనల్ చేరాలంటే కచ్చితంగా గెలవాల్సిన ఈ కీలక పోరులో భారత షట్లర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వరుస ఓటములతో టోర్నీ నుంచి భారత్ నిష్క్రమించింది.

**ఆశలు రేపిన సింధు.. ఆఖర్లో బోల్తా!**

తొలి సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, చైనా క్రీడాకారిణి వాంగ్ జీయా మధ్య హోరాహోరీ పోరు సాగింది. తొలి గేమ్‌ను 16-21తో కోల్పోయిన సింధు, రెండో గేమ్‌లో అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించి 21-19తో గెలిచింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఒక దశలో 18-12 ఆధిక్యంతో విజయం అంచున నిలిచిన సింధు, ఆఖరి నిమిషంలో అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. వరుస పాయింట్లతో విరుచుకుపడిన వాంగ్ 21-19తో గేమ్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకోవడంతో భారత్ ఒత్తిడిలో పడింది.

**వరుస ఓటములతో వైట్‌వాష్..**

సింధు ఓటమితో ప్రారంభమైన పతనం మిగిలిన మ్యాచ్‌ల్లోనూ కొనసాగింది.

డబుల్స్: తొలి డబుల్స్ మ్యాచ్‌లో ప్రియ కొంజెంగ్‌బమ్ - శ్రుతి మిశ్రా జంట చైనా జోడీ చేతిలో పరాజయం పాలైంది.

సింగిల్స్: రెండో సింగిల్స్‌లో ఇషారాణి బారువా సైతం విఫలం కావడంతో చైనా 3-0తో ఆధిక్యాన్ని సాధించి భారత్ అవకాశాలను దెబ్బతీసింది.

నామమాత్రపు మ్యాచ్‌లు: ఆ తర్వాత జరిగిన రెండో డబుల్స్‌లో తనిషా క్రాస్టో - కావిప్రియ సెల్వం జంట, చివరి సింగిల్స్‌లో దేవికా సిహాగ్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ ఓటమిని తప్పించుకోలేకపోయారు. దీంతో భారత్ 0-5తో వైట్‌వాష్‌కు గురైంది.

**పురుషుల జట్టు ముందంజ:**

మహిళల జట్టు నిరాశపరిచిన వేళ, భారత పురుషుల జట్టు మాత్రం థామస్ కప్‌లో సత్తా చాటుతోంది. ఆస్ట్రేలియాపై ఘనవిజయం సాధించిన భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# క్రికెట్ అకాడమీని ప్రారంభించిన విరాట్ కోహ్లీ



**బలగం టీవి, న్యూఢిల్లీ**

క్రికెట్ గ్రౌండ్‌లో తన అగ్రెసివ్ ఆట తీరుతో ప్రత్యర్థులను వణికించే విరాట్ కోహ్లీ ఇప్పుడు ఒక మంచి ప్రసంగంతో విద్యార్థులకు ఒక మర్చిపోలేని సందేశం ఇచ్చారు. దిల్లీలోని డీపీఎస్ (దిల్లీ పబ్లిక్ స్కూల్) ఆర్కేపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవానికి విరాట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూల్ మీటింగ్‌లలో మాట్లాడటం తనకు కొంత కొత్తగా ఉందని చెప్పినప్పటికీ విద్యార్థులతో తన మనసులోని మాటలను పంచుకున్నారు. తాను కూడా ఒకప్పుడు ఇలాంటి దశ నుంచే వచ్చానని చెబుతూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. కోహ్లీ రాకతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. జీవితంలో ఏదైనా సాధించాలంటే ముందుగా మన కలల పట్ల మనం నిజాయితీగా ఉండాలని విరాట్ కోహ్లీ విద్యార్థులకు హిత బోధ చేశారు. "మీరు ఏం చేయాలనుకుంటున్నారో దానిపై క్లారిటీతో ఉండండి. ఆ టార్గెట్ కోసం పూర్తి నిబద్ధతతో పని చేయండి. మీరు మీ పని పట్ల 100 శాతం నిజాయితీగా ఉన్నారో లేదో మీకు మాత్రమే తెలుస్తుంది" అని కోహ్లీ పేర్కొన్నారు. తాను చిన్న వయసులోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నానని, ఆ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు, టీచర్లకు ఎంతో నిజాయితీగా వివరించానని ఆయన గుర్తుచేసుకున్నారు. ఏ రంగంలోనైనా క్లారిటీ ఉంటేనే అనుకున్నది సాధించగలమని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల అనేది కేవలం చదువుకునే చోటు మాత్రమే కాదని మంచి వ్యక్తులుగా ఎదిగే ఫ్లాట్‌ఫామ్ అని కోహ్లీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా టీచర్లు తమ జీవితంలో కొంత భాగాన్ని విద్యార్థుల భవిష్యత్తు కోసం వెచ్చిస్తారని అటువంటి వారి పట్ల ఎంతో గౌరవం కలిగి ఉండాలని సూచించారు. నేర్చుకునే వాతావరణాన్ని, మీకు విద్యను నేర్పించే గురువులను గౌరవించినప్పుడే మీరు సరైన మార్గంలో పయనిస్తారని చెప్పారు. నేర్చుకోవాలనే తపన, వినే ఏకాగ్రత ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని విద్యార్థులకు వివరించారు. కింగ్ కోహ్లీ చెప్పిన ఈ పాయింట్స్ విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విరాట్ కొన్ని ఆసక్తికర విషయాలు చెప్పారు. తాను ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పుడే క్రికెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టానని ఈ అకాడమీ తన జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. ఇప్పటికీ సమయం దొరికినప్పుడల్లా తాను అకాడమీకి వస్తూనే ఉంటానని చెప్పారు. ఇక్కడ క్రికెట్ నేర్చుకోవడానికి వచ్చే పిల్లలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ అకాడమీ స్కూల్‌కు, ఇక్కడి క్రికెట్ సెటప్‌కు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కోహ్లీ తన ప్రసంగాన్ని ముగించారు. మరోవైపు ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించారు. ఐపీఎల్ చరిత్రలో 9000 పరుగుల మార్క్ రికార్డును అందుకున్న తొలి ఆటగాడిగా విరాట్ మళ్లీ తానేంటో నిరూపించుకున్నాడు. సోమవారం దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఈ రికార్డును అందుకున్నాడు. మరో హైలెట్ ఏమిటంటే తన క్రికెట్ ప్రయాణం మొదలైన గ్రౌండ్‌లోనే ఈ అపురూపమైన రికార్డు నమోదు చేయడం విశేషం. కింగ్ కోహ్లీ ఫామ్ చూస్తుంటే ఈ సీజన్‌లో మరిన్ని రికార్డులు బద్దలవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. గత ఏడాది సీజన్ ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకున్న ఆర్?సీబీ ఈసారి కూడా అంతే పట్టుదలతో ఆడుతోంది. సోమవారం దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ బౌలర్లు నిప్పులు చెరిగారు. జోష్ హేజిల్‌వుడ్ (4/12), భువనేశ్వర్ కుమార్ (3/5) అద్భుతమైన స్పెల్స్ వేయడంతో దిల్లీ జట్టు కేవలం 75 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఛేజింగ్‌లో ఆర్సీబీ బ్యాటర్లు మరింత చెలరేగారు. జాకబ్ బెథెల్ (20), దేవదత్ పడిక్కల్ (34లి), విరాట్ కోహ్లీ (25లి) కేవలం 6.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి పది వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఆర్సీబీ 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. వరుస విజయాలతో కోహ్లీ సేన ప్లే ఆఫ్స్ దిశగా పక్కా ప్లాన్‌తో వెళ్తోంది.



# నా రీఎంట్రీని అడ్డుకుంటున్నారు

- స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

రిటైర్మెంట్‌ను పక్కన పెట్టిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 2028 ఒలింపిక్స్‌లో పోటీపడతానని ఇప్పటికే ప్రకటించింది. రెజ్లింగ్‌లోకి తన పునరాగమనాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారంటూ తాజాగా ఆమె ఆరోపించింది. ఆసియా, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ట్రయల్స్ గడువు సమీపిస్తోన్న నేపథ్యంలో ఆమె జాతీయ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేసింది.నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లోకి తిరిగి రావాలని చూస్తున్నట్లు వినేశ్ ఫొగాట్ ప్రకటించింది. " నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పునరాగమనం చేయాలని ఆశిస్తున్నా. రిజిస్ట్రేషన్ తుది గడువు ఏప్రిల్ 30 వరకు ఉంది. కానీ రిజిస్టర్ చేసుకోవాలని ప్రయత్నిస్తుంటే గడువు ముగిసింది అనే సందేశం వస్తోంది. దీనిపై రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలోని పాలనా యంత్రాంగాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించాను. కానీ వారు నా కాల్స్‌కు స్పందించలేదు. ఫెడరేషన్ కప్‌లోను పాల్గొందామనుకున్నాను. కానీ అక్కడ చివరి నిమిషంలో ఎంపిక ప్రమాణాలు మార్చారు. దాంతో నేను ఆడలేకపోయాను. నన్ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవాలని చూస్తున్నారని అనిపిస్తోంది. ఆసియా గేమ్స్, వరల్డ్ ఛాంపియన్ షిప్ సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీలో ఉండాలంటే ఈ టోర్నమెంట్ ఎంతో కీలకం" అని వినేశ్ ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. చాలా మంది రెజ్లర్లు రిజిస్ట్రేషన్ విషయంలో సమస్యలు ఎదుర్కొన్నారని, వారు ఫెడరేషన్ సిబ్బందిని సంప్రదించి సమస్యలు పరిష్కరించుకున్నారని చెప్పారు. "పోటీపడకుండా మేం ఎవరినీ అడ్డుకోం. టోర్నమెంట్ అందరికీ అందుబాటులో ఉంటుంది" అని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. వినేశ్ ఇప్పటికి పలుమార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడ్డారు. 2016లో జరిగిన ఒలింపిక్స్‌తో ఆమె ఎంట్రీ ఇచ్చారు. అయితే అప్పట్లో మోకాలి గాయంతో క్వార్టర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2021లో భారీ అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టినప్పటికీ అక్కడా క్వార్టర్స్‌లోనే అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 2024లో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫోగాట్?కు రజతం ఖాయమైంది. కానీ రెండో రోజు బరువు చూసే సమయానికి 100 గ్రాములు అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడి రజత పతకాన్ని కోల్పోయింది. ఈ బాధతోనే ఆమె రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించింది. తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన ఆమె హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, జులానా నియోజకవర్గం నుంచి విజయం సాధించింది. అప్పట్లో వినేశ్ ఫొగాట్‌పై వేటు వెనుక కుట్ర కోణం ఉందనే ఆరోపణలు వినిపించాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ అతడిని బహిష్కరించాలనే డిమాండ్‌తో అప్పట్లో దేశ రెజ్లర్లంతా ఏడాదికిపైగా ఆందోళన నిర్వహించారు. ఆ ఉద్యమానికి వినేశ్‌తోపాటు ఇతర స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్ నేతృత్వం వహించారు. తీవ్ర స్థాయికి చేరిన ఆ ఉద్యమం చివరికి పార్లమెంట్ ముట్టడికి దారి తీయడం, ఆ క్రమంలో వినేశ్ సహా ఇతర రెజ్లర్లను పోలీసులు అరెస్ట్ చేయడం వరకు వెళ్లింది. రెజ్లర్ల ఆందోళన ఫలితంగా డబ్ల్యూఎఫ్ఐకి బ్రిజ్‌భూషణ్ రాజీనామా చేయక తప్పలేదు.




# శాంట్నర్ స్థానంలో కేశవ్ మహరాజ్

## ముంబయి జట్టులోకి రానున్న స్పిన్నర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబయి ఇండియన్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆ జట్టు ప్రధాన స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ భుజం గాయం కారణంగా ఈ సీజన్ నుండి వైదొలిగారు. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో ఆయనకు ఈ గాయమైంది. శాంట్నర్ స్థానంలో దక్షిణాఫ్రికా వెటరన్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ముంబయి జట్టులోకి తీసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హోమ్ మ్యాచ్‌లో శాంట్నర్ ఫీల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బౌండరీ వద్ద ఒక కఠినమైన క్యాచ్‌ను అందుకునే క్రమంలో ఆయన భుజానికి తీవ్రమైన గాయమైంది. అదే సమయంలో ఆయన తల కూడా బలంగా నేలకు తగిలింది. దీంతో ఆయనను మైదానం నుంచి వెలుపలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పటికే శాంట్నర్ తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసి, ఒక వికెట్ తీసి 44 పరుగులు సమర్పించుకున్నారు. శాంట్నర్ తలకు దెబ్బ తగలడంతో, నిబంధనల ప్రకారం శార్దూల్ ఠాకూర్‌ను కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి తీసుకున్నారు. అయితే, ముంబయి అప్పటికే అల్లా గజన్ఫర్ స్థానంలో డానిష్ మలేవర్‌ను 'ఇంపాక్ట్ ప్లేయర్'గా ఉపయోగించుకుంది. 208 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శార్దూల్ ఠాకూర్ 12 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ మ్యాచ్‌లో ముంబయి 103 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూసింది. శాంట్నర్‌ను గత కొంతకాలంగా భుజం గాయం వేధిస్తోంది. ఏప్రిల్ 4న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన బౌలింగ్ చేయని భుజానికి చిన్న గాయమైంది. దీనివల్ల ఏప్రిల్ 7న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ఆయన దూరమయ్యారు. ఏప్రిల్ 12న ఆర్సీబీతో మ్యాచ్‌లో పునరాగమనం చేసినప్పటికీ, ఏప్రిల్ 23న చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో అదే భుజానికి మళ్ళీ గాయం కావడంతో ఈసారి టోర్నీ నుంచే తప్పుకోవాల్సి వచ్చింది. శాంట్నర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు ముంబయి మేనేజ్‌మెంట్ దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ఎంపిక చేసింది. రూ. 75 లక్షల కనీస ధరకు ఆయనను ఒప్పందం చేసుకున్నారు. మహరాజ్ గతంలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కావడంతో శాంట్నర్ లోటును ఆయన కొంతవరకు భర్తీ చేస్తారని ముంబయి ఆశిస్తోంది. వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో దిగువన ఉన్న ముంబయికి శాంట్నర్ వంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు దూరం కావడం పెద్ద మైనస్. మరి కొత్తగా వచ్చిన కేశవ్ మహరాజ్ ముంబయి రాతను మారుస్తారో లేదో చూడాలి.

# ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి మిచెల్ స్టార్క్


**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమై సగం మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు ఊరటనిచ్చే వార్త అందింది. ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఎట్టకేలకు తన ఫ్రాంచైజీతో చేరాడు. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి నిరభ్యంతర పత్రం లభించడంతో స్టార్క్ ఢిల్లీ జట్టులో చేరినట్లు యాజమాన్యం ధృవీకరించింది. మెగా వేలంలో రూ. 11.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ స్టార్ బౌలర్ అందుబాటులోకి రావడం ఢిల్లీ బౌలింగ్ విభాగానికి కొండంత అండగా మారనుంది. మిచెల్ స్టార్క్ ఈ ఏడాది జనవరి చివరి వారం నుండి ఎటువంటి పోటీ క్రికెట్ ఆడలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్ బాష్ లీగ్ లో సిడ్నీ సిక్సర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ఆయన గాయపడ్డారు. బౌండరీ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో స్టార్క్ ఎడమ భుజం మరియు మోచేతికి తీవ్రమైన గాయమైంది. ఈ గాయం కారణంగా ఫిట్‌నెస్ సాధించడం ఆలస్యం కావడంతో, ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు ఆయన దూరం కావాల్సి వచ్చింది. ఇప్పటివరకు ఢిల్లీ ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో స్టార్క్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ స్టార్క్ రాకపై స్పందించారు. "అవును, మిచెల్ స్టార్క్ జట్టుతో చేరారు. ఆయనకు మే 1వ తేదీ నుండి ఆడేందుకు ఎన్‌ఓసీ లభించింది. ప్రస్తుతానికి ఆయన వర్క్‌లోడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆయన పూర్తిగా అందుబాటులోకి వచ్చిన వెంటనే తుది జట్టులోకి తీసుకుంటాం" అని అక్షర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో 11 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి స్టార్క్ అద్భుతంగా రాణించారు. స్టార్క్ రాక వార్త ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తున్నా, సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ప్రదర్శన మాత్రం పీడకలలా మిగిలిపోయింది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే ఏకంగా ఆరు వికెట్లు కోల్పోయి 75 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా సునాయాసంగా ఛేదించింది. ఈ ఘోర ఓటమిపై అక్షర్ పటేల్ అసహనం వ్యక్తం చేశారు. "అసలేం జరిగిందో నాకిప్పటికీ అర్థం కావడం లేదు. క్రికెట్‌లో ప్రతిరోజూ కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ ఓటమిని మర్చిపోయి వచ్చే మ్యాచ్‌పై దృష్టి సారించాల్సి ఉంది" అని ఆయన అన్నారు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి పడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, తన తదుపరి పోరులో మే 1వ తేదీన జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. అదే రోజున స్టార్క్ అందుబాటులోకి వస్తుండటంతో, రాజస్థాన్ పటిష్టమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ ఏ మేరకు అడ్డుకుంటాడో చూడాలి.





# కోహ్లీ వల్లే ఈ వికెట్ల జాతర

- ఆర్‌సీబీ బౌలర్ భువనేశ్వర్ కుమార్



ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ తన విజయాల పరంపరను కొనసాగిస్తోంది. సోమవారం రాత్రి ఢిల్లీలో ఢిల్లీ కేపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ స్కోర్ ను అలవోకగా అందుకుంది. 81 బంతులు మిగిలి ఉండగానే దీన్ని ఛేదించింది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే రెండో అతిపెద్ద విజయం. ఇప్పటివరకు ఆడిన ఎనిమిది మ్యాచ్ లల్లో ఆరింట్లో నెగ్గింది ఆర్సీబీ. మొత్తం 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ కేపిటల్స్ 16.3 ఓవర్లలో 75 పరుగులకు ఆలౌటైంది. ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ ఒక్కడే టాప్ స్కోరర్. 33 బంతుల్లో 3 ఫోర్లతో 30 పరుగులు చేశాడు. అర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ (3/5), జోష్ హేజిల్‌వుడ్ (4/12) ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించారు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మ, రసిక్‌ధర్ సలామ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.అనంతరం ఆర్‌సీబీ 6.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ (15 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 23 నాటౌట్), దేవదత్ పడిక్కల్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34 నాటౌట్) అజేయంగా నిలిచారు. జాకబ్ బెథెల్ 11 బంతుల్లో ఫోర్, రెండు సిక్స్‌లతో 20 పరుగులు చేశాడు. తన బౌలింగ్ పట్ల భువనేశ్వర్ కుమార్ సంతృప్తిని వ్యక్తం చేశాడు. జట్టులో విరాట్ కోహ్లీ అనుభవం, అతను ఇచ్చిన విలువైన సూచనలు తనకు పనికొచ్చాయని చెప్పాడు. కోహ్లీ కెప్టెన్ గా లేకపోయినా అతని సలహాలు జట్టు ప్లానింగ్ లో గణనీయమైన మార్పును తీసుకొస్తున్నాయని తెలిపాడు. కోహ్లీ వంటి అనుభవజ్ఞుడి ఉనికి జట్టు వాతావరణం, మైదానంలో కీలక నిర్ణయాలపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీతో కమ్యూనికేషన్ చాలా ముఖ్యమని, బ్యాటింగ్‌లో గానీ, బౌలింగ్ లో గానీ అతని సలహాలు ఎంతో సహాయపడతాయని, అంత అనుభవం ఉన్న ఓ ప్లేయర్ జట్టులో ఉండటం ఓ గొప్ప అసెట్ భువి వివరించాడు. తన దృక్పథంలో కూడా మార్పును తీసుకొచ్చిన వ్యక్తిగా కోహ్లీని అభివర్ణించాడు భువనేశ్వర్ కుమార్. వ్యక్తిగత ప్రదర్శనల గురించి తాను పెద్దగా ఆలోచించనని, అందరూ సమష్టిగా ఆడితేనే జట్టు గెలుస్తుందని చెప్పాడు.

# మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ



దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వావెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.

# వరుస సినిమాలతో బాలయ్య బిజీ

కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ స్జబెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది




బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య-గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య-గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది. మరి బాలయ్య - కొరటాల శివమూవీ ఎప్పుడు ఎలా ప్రేక్షకులనుపలకరిస్తుందో చూడాలి.

# చిత్తూరు జిల్లా వి.కోటలో దారుణం




- ఎబిఎన్ జర్నలిస్టును హత్య చేసిన రౌడీ షీటర్
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

చిత్తూరు,ఏప్రిల్28 : వి.కోటలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి జగన్‌ను కత్తులతో నరికి చంపేశారు. ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. హత్యకు పాల్పడింది రౌడీ షీటర్ తమీమ్‌గా గుర్తించారు. తమీమ్‌కు మరో వ్యక్తి సాయపడినట్టు పోలీసులు వెల్లడించారు. తమీమ్‌ది వి.కోట అయినప్పటికీ ప్రస్తుతం కర్ణాటకలో నివాసం ఉంటున్నాడు. మృతుడు జగన్మోహన్ రెడ్డి ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం తిరుపతి జిల్లా సభ్యుడు అరవ గోపాల్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే చర్చించి పరిష్కరించుకోవాల్సిన మార్గాలు చాలా ఉన్నాయని... అలా కాదని దుర్మార్గమైన, దురహంకారమైన ఆలోచనలతో తోటి మనిషిని చంపడం బాధాకరమన్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తోటి విలేకరి చనిపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ 'ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం' తరపున అరవ గోపాల్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒుత్తూరు జిల్లా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెంగ( లాయులు (గాంధీ), వళిగళం గోపిలు తీవ్రంగా ఖండించారు. హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్య వెనకున్నది ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని హత్య వెనుకున్న అసలు నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ జర్నలిస్టుల ఆందోళనకు ఆ సంఘం అధ్యక్షులు జి ఆం జనేయులు పిలుపునిచ్చారు. ఒక సామాన్య జర్నలిస్టును అతికిరా తంగా చంపడం దారుణమని అన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు వెంటనే హత్య వెనుక దాగి ఉన్న కుట్రను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హత్యను జర్నలిస్ట్ సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెంగ్రలాయులు, వళిగళం గోపి ఆవేదన వ్యక్తం చేశారు.


# లుక్ టెస్ట్ పూర్తయ్యింది

## చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించే దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి - బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం



చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ





దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.

# మా ఇంటి బంగారం ప్రమోషన్స్

ఇంకా మొదలు పెట్టని నటి సమంత

ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క






నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్- నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ - సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు. మరి ఇప్పటికైనా సామ్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించకపోతే సినిమాపై ఆశలు వదులుకోవాల్సిందే అని పలువురు చెప్పుకొస్తున్నారు.

# పండుగాడి జర్నీకి 20 ఏళ్లు

పోకిరీ విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది. సినిమా ప్రథమార్థం అంతా పండుగాడు అనే ఒక సాధారణ లోకల్ రౌడీగా కనిపించిన మహేష్ బాబు, క్లైమాక్స్ వచ్చేసరికి కృష్ణ మనోహర్ అనే అండర్ కవర్ ఐపీఎస్ ఆఫీసర్ అని రివీల్ అయ్యే సీన్ ప్రేక్షకులకు ఊహించని థ్రిల్ ఇచ్చింది. ఈ ఒక్క ట్విస్ట్ అప్పట్లో థియేటర్లలో సంచలనం సృష్టించడమే కాకుండా, సినిమాను మళ్ళీ మళ్ళీ చూసేలా ప్రేక్షకులను ప్రోత్సహించింది. 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో వాడే పండుగాడు', 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' వంటి డైలాగులు నేటికీ తెలుగు ప్రేక్షకుల నాలుకలపై నానుతూనే




ఉన్నాయి. ఈ సినిమా క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా, తమిళంలో విజయ్ హీరోగా, హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా, కన్నడలో దర్శన్ హీరోగా రీమేక్ అయ్యి అక్కడ కూడా ఘనవిజయాలను అందుకుంది. 'పోకిరి' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహేష్ బాబు అభిమానులు సోషల్ మీడియాలో భారీ ఎత్తున వేడుకలు జరుపుకుంటున్నారు.